జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

సమస్యలపై పోరు

- నేటి నుండి 13 వరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు
- 14న మండల కేంద్రాలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ధరల భారాలు మోపుతుండగా మరో వైపు సమస్యలు పేరుకుపోయాయి. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 8 నుండి 13 వరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 14న అన్ని మండల కేంద్రాలతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టనున్నారు...

ధరాభారం..

కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటాయి. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా కిలో రూ.80 దాటాయి. గత ఏడాదితో పోల్చితే 40 శాతం పెరిగాయి. కందిపప్పు రూ.95 నుండి రూ.180కు పెరిగింది. పామాయిల్, వంటనూనె ధరలు 40 శాతం పెరిగాయి. పండగల సందర్భంగాను, రోజువారీ సరుకుల కొనుగోళ్ళలోనూ ధరల ప్రభావం కనిపిస్తోంది.

కానరాని ఉచిత ఇసుక

ఉచిత ఇసుక ఎక్కడ అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రకృతి ప్రసాదించిన ఇసుకను ఉచితంగా ఇవ్వాల్సిన ప్రభుత్వాలు దానిని కూడా వ్యాపారంగా చూస్తున్నాయి. తాము అధికారంలో వస్తే ఉచిత ఇసుక విధానం తెస్తామని చెప్పి నేటికీ అమలు చేయడం లేదు. గత వైసిపి ప్రభుత్వం ఇసుకను బంగారం కంటే ఖరీదైనదిగా చేసినందువల్లనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని అధికారం నుండి దించేశారు. కొత్త ప్రభుత్వం వచ్చి వందరోజులు పూర్తయినా ప్రజలకు మాత్రం ఇసుక అందుబాటులో తక్కువ ధరకు దొరకడం లేదు. భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. వాహన యజమానులు, కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మళ్లీ విద్యుత్ ఛార్జీల వడ్డన

ఇప్పటికే ధరల పెరుగుదలతో ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ భారాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం మోపింది. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నెల నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలలో 44 శాతం వరకు అదనంగా చెల్లించాలి. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గిస్తామని హామీలిచ్చినా టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతి అలా ఉంచినా, ఇప్పుడు అమాంతంగా 44 శాతం విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేస్తున్నారు.

విచ్చలవిడిగా మద్యం..

గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, ఇప్పుడు ప్రయివేటుకు అప్పగించారు. ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణ పరిధిలో పెద్దఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. విచ్చలవిడితనం, సమయాలు పెంచడం, బెల్టుషాపులకు తెరదీయడంవల్ల పేదల బ్రతుకులు అంధకారంగా మారుతున్నాయి. యువత మత్తుకు బానిసగా మారటానికి కారణమవుతున్నది.

అభివృద్ధికి నోచుకోని రహదారులు, కాలనీలు

జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లిన రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ప్రయాణాలు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. పేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళు, టిడ్కో ఇళ్ళ కాలనీల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. గత 20 సంవత్సరాల నుండి పేదల కాలనీలు నిర్మాణానికి, మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. రోడ్లు, మంచినీరు, విద్యుత్, వీధిలైట్లు, డ్రైనేజిల నిర్మాణాలు జరగడం లేదు. ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయక మధ్యలోనే నిర్మాణాలు ఆగిన ఇళ్ళు వేల సంఖ్యలో ఉన్నాయి.

హామీలకే పరిమితం..

తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మ బలికిన టిడిపి కూటమి ప్రభుతం ఆయా పథకాలను హామీలకే పరిమితం చేసింది. పిల్లల చదువుకు సంబంధించి తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్ళు దాటిన మహిళలకు నెలకు రూ.1500, రైతు భరోసా కింద రూ.20 వేలు తదితర పథకాలు నేటికి అమలుకు నోచుకోలేదు. మెగా డిఎస్సీ అందని ద్రాక్షలా మారింది.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వరకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి వారి ఇంటి వద్దే బ్రెస్ట్, ఓరల్, సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను శిక్షణ పొందిన వైద్య నిపుణులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఆర్ ఎస్‌కెఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత, డాక్టర్ ఉమా, డిపిఎంఒ విజయరాజు, డెమో శ్రీనివాసులు, ఎపిడమలజిస్ట్ వేణుగోపాల్, డిసిఎం ప్రసాద్, రీజినల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, నర్సింగ్ ట్యూటర్ హెచ్ఈ పద్మావతి, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

9, 10న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

- జయప్రదం చేయండి : హేమంత్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

గూడూరులో ఈ నెల 9, 10వ తేదీలలో జరిగే యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి హేమంత్ కుమార్ కోరారు. గురువారం గూడూరులోని కార్యాలయంలో గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. హేమంత్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ 1974 ఆగష్టు 10న అమలాపురంలో మొదలై రాష్ట్రంలో అగ్రగామి సంఘంగా నిలిచిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, అప్రెంటిషిప్ రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్ సాధనకు ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. నేటికీ సంఘం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. జిల్లా మహాసభను గూడూరులోని గ్లోబల్ స్కూల్ ఆవరణంలో రెండు రోజులు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు లక్ష్మి కాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, సురేష్, ప్రదీప్, పాహీదా, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

ఆపార్‌పై నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు ఆపార్ ఐడి జనరేట్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకమీదట ఇదే కొనసాగితే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా హెచ్చరించారు. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆపార్ నమోదు 56 శాతం అయిందని, చాలా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకొని వేగవంతం చేయాలని సూచించారు. వారంలోపు 70 శాతానికి మించి నమోదు కావాలని, అనంతరం సమీక్ష నిర్వహిస్తానని హెచ్చరించారు. ఆపార్ నమోదుపై జరుగుతున్న జాప్యాలను అన్ని మండలాల ఎంఈఓలతో ఒక్కొక్కరితో మాట్లాడారు. సమస్యలు ఉన్నప్పుడు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాల్వలో దూకి అగ్రిగోల్డ్ ఏజెంట్ ఆత్మహత్య

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరానికి చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్ వి.వెంకట రామరాజు హంద్రీనీవా కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. వి.వెంకటరామరాజు అగ్రిగోల్డ్ సంస్థలో 11 సంవత్సరాలు ఏజెంట్‌గా పని చేశారు. దాదాపు రూ. 50 లక్షల వరకు కంపెనీకి డిపాజిట్లు సేకరించారు. అగ్రిగోల్డ్ కంపెనీ బోర్డు తిప్పేసినప్పటి నుండి తీవ్ర మనోవేధనకు గురయ్యాడు. గురువారం ఉదయం కర్నూలు దగ్గరలోని బి.తాండ్రపాడు దగ్గర గల టోల్ ప్లాజా దగ్గర గల హంద్రీనీవా కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వం వెంకట రామరాజు కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లికార్జున మాట్లాడుతూడిమాండ్ చేశారు.

26న రైతు, కార్మిక సంఘాల మహా ప్రదర్శన, ధర్నా

- జయప్రదం చేయండి : రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా రైతు సంఘాలు ఈ నెల 26న తలపెట్టిన దేశవ్యాప్త మహా ప్రదర్శనలు, ధర్నాలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు కోరారు. గురువారం కర్నూల్ నగరంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన సమావేశానికి ఎఐటియుసి, సిఐటియు, టియుసిసి, ఐఎన్‌టియుసి, రైతు, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అంజి బాబులు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ప్రధాని మోడీ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటానని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టాన్ని తీసుకువస్తామని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని ఇచ్చిన మాట అమలు చేయకుండా మాట తప్పారని విమర్శించారు. కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచి కార్మికులకు రోజుకు వేతనం రూ.600లకు పెంచాలన్నారు. కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈ నెల 26న కర్నూలు జిల్లా కేంద్రంలో 2 వేల మందితో, ఆదోని డివిజన్ కేంద్రంలో వెయ్యి మంది కార్మిక, రైతులతో మహా ప్రదర్శన నిర్వహించి ధర్నాలు చేయాలని, ఈ కార్యక్రమాల విజయవంతం కోసం గ్రామాలలో, పట్టణాలలో విస్తృతంగా ప్రచారాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర ఉప కార్యదర్శి టి.రామాంజనేయులు, ఈశ్వర్, డిసి రెహమాన్, నల్లన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, విజయ్, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బతకన్న, టియుసిసి జిల్లా నాయకులు తిరుపాలు, వెంకటస్వామి, అర్లప్ప, రాజు, రైతు సంఘం జిల్లా నాయకులు డి శ్రీనివాసరావు, జి.సురేంద్ర, పుల్లన్న, కృష్ణ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు పిఎస్ రాధాకృష్ణ

బహుమతులు ప్రదానం చేస్తున్న సభ్యులు

జిబిఎల్‌యుకె ట్రస్టు ఆధ్వర్యంలో

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని బురాన్‌దొడ్డి హైస్కూల్‌లో క్రీడల్లో, విద్యలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గొల్ల బుడ్డన్నగారి లక్ష్మమ్మ, ఉదయ్ కుమార్ స్మారక ట్రస్టు సౌజన్యం (జిబిఎల్‌యుకె) ఆధ్వర్యంలో గురువారం బహుమతులు, మెమోంటోలు ప్రదానం చేశారు. ట్రస్టును ప్రారంభించి ట్రస్టు బురాన్‌దొడ్డికే పరిమితం కాకుండా మండలంలోని అన్ని పాఠశాలల్లోని ప్రతిభవంతులకు, నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటుందని ట్రస్టు డైరెక్టర్ జయరాముడు, ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ శ్రీరాములు, ఉపాధ్యక్షులు తరుణ్ కుమార్, చంద్రశేఖర్ తెలిపారు. అలాగే బాల్య దశలో చదువు కోసం ఐదు కిలోమీటర్లు నడిచి బెళగల్‌లో అభ్యసించాల్సి ఉండేదని, తమ కుటుంబం దృష్టి కేంద్రీకరించి 2001లో మూడెకరాలు ఇచ్చి హైస్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. నేటి విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటుతుండడం ఆనందంగా ఉందని తెలిపారు. ట్రస్టు కోశాధికారి వీరకుమార్, విద్యాధికారులు జ్యోతి, ఆడమ్ బాషా, ఎస్ఐ తిమ్మారెడ్డి, గురుకుల, మోడల్ ప్రిన్సిపల్స్ బలరాం, వంశీమోహన్ రావు, వెల్దుర్తి ఎంఇఓ-2 రమేష్, సంఘాల మాజీ సర్పంచి హనుమంతు, బురాన్‌దొడ్డి సర్పంచి రామాంజినేయులు, ప్రధానోపాధ్యాయులు నిర్మలా వసంత కుమారి, పాఠశాల ఛైర్మన్ డిష్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఎంబిబిఎస్ విద్యార్థి దత్తత

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.అద్భుత కుమార్‌ను దత్తత తీసుకున్నట్లు జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు చేతులమీదుగా ఆ విద్యార్థికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోనెగండ్ల మండలం అలువాల గ్రామానికి చెందిన అద్భుత్ కుమార్ కుటుంబం పేద కుటుంబమని తెలిపారు. కూలి పని చేసుకొని జీవితం గడుపుతున్నారని చెప్పారు. విద్యార్థి చిన్నటేకూరు రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారని తెలిపారు. నీట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మొదట కడప మెడికల్ కళాశాలలో సీట్ సాధించారని చెప్పారు. స్లీపింగ్ కింద ఇప్పుడు అనంతపురం మెడికల్ కళాశాలలో చేరారని తెలిపారు. అతని కళాశాల ఫీజు, హాస్టల్ ఫీజు కింద ఎపి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూ.50 వేలు అందజేశారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ సునీల్ కుమార్, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు ఈరన్న, జిల్లా గౌరవ సభ్యులు సోమన్న, వీరేష్, తిమ్మయ్య, అర్జున్ నాయక్, సురేంద్ర నాథ్, రామయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఉచితంగా డప్పు కొట్టమని బెదిరించిన

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఉచితంగా డప్పు కొట్టాలంటూ బెదిరించిన సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం కర్నూల్ నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కేకే భవన్‌లో ఎపిడికెఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. చక్రపాణి, కె.రాజ్ కుమార్‌తో కలిసి కరుణాకర్ మాట్లాడారు. కర్నూలు మండలం జి సింగవరం, ఎదురూరు గ్రామాలలో సచివాలయ అధికారులు ఉచితంగా డప్పు కొట్టకపోతే మీ పెన్షన్లు తీసేస్తామంటూ భయపెడుతున్నారన్నారు. డప్పు కళాకారులను ఉచితంగా డప్పు కొట్టమని అంటున్నారంటే మిగిలిన పెన్షన్ తీసుకునే వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో అధికారుల ఇళ్లల్లో పనులు చేయమని బెదిరిస్తున్నారా అని ప్రశ్నించారు. కాదు దళితులు మాత్రమే ఉచితంగా కొట్టాలి అని అంటే ఇది దళితుల పట్ల అధికారులు చూపుతున్న వివక్ష కాదా అని మండిపడ్డారు. నిరక్షరాస్యులు, మాట్లాడలేని దళితులుగా ఉన్న డప్పు కళాకారులపై అధికారులు జిల్లాలో అక్కడక్కడ ఇలాంటి ప్రతాపం చూపుతున్నారని, అలాంటి వారిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. డప్పు కళాకారుల వృత్తి పెన్షన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని, వయసుతో నిమిత్తం లేకుండా డప్పు కళాకారులు అందరికీ డప్పు, గజ్జలు, డ్రెస్సును కొత్త ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టితో ఇవ్వాలని కోరారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందిస్తాం

- సర్పంచి లీలావతి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని పెండేకల్లు గ్రామంలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సర్పంచి ఎం.లీలావతి, ఎంపిటిసి పెద్ద రంగన్న, వైసిపి నాయకులు అట్లా బసిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, సర్పంచి సలహాదారుడు మద్దిలేటి తెలిపారు. గురువారం పెండేకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును సర్పంచి లీలావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ ట్యాంకును అదనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం, గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసిపి నాయకులు చందోలు పెద్దయ్య, మూగి వెంకటరాముడు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన

- సిసి రోడ్ల నిర్మాణం, నాణ్యతపై ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

నంద్యాల జిల్లాలోని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్ర రెడ్డి, ఇఇలు రఘురామి రెడ్డి, నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సిసి రోడ్ల నిర్మాణం, నాణ్యతపై అవగాహన సదస్సు నిర్వహించడం ఉపయోగమని తెలిపారు. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలు శిక్షణ ద్వారా తెలుస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఇంజినీర్లకు ఈ సదస్సు చాలా ఉపయోగమని, ప్రతి ఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ డిఇఇ రవీంద్ర రెడ్డి, డోన్ డిఇఇ గంగాధర్, నందికొట్కూరు డిఇఇ ధనిబాబు, కర్నూలు క్వాలిటీ కంట్రోల్ ఎఇ కె.విజయ భాస్కర్‌లు శిక్షణ ఇచ్చారు.

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్రీడాకారులను అభినందిస్తున్న పార్వతమ్మ

మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను టిడిపి నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షులు కె.పార్వతమ్మ అభినందించారు. గురువారం పార్వతమ్మ నివాసంలో తైక్వాండో క్రీడాకారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడారు. ఆత్మరక్షణ క్రీడా తైక్వాండోను ప్రతిఒక్కరూ సాధన చేయాలని తెలిపారు. ఇలాంటి పోటీల్లో పాల్గొంటే చదువుతోపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఎస్‌జె తైక్వాండో అకాడమీ వారు ఉచితంగా చాలామంది విద్యార్థులతో సాధన చేయిస్తున్నారని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు సి.సందీప్ తరుణ్, బి.మనోజ్‌లు ఈనెల 7 నుంచి 13 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొంటున్నారు. ఎస్‌జె అకాడమీ వ్యవస్థాపకులు పార్వతమ్మ, టిడిపి కస్టర్ ఇన్‌ఛార్జీ కె.జనార్ధన్ ఆచారి, టిడిపి యువ నాయకులు కె.శివ పాల్గొన్నారు. అలాగే అకాడమీ కోచ్‌లు సురేంద్ర, ఇబ్రహీంలు విద్యార్థులను అభినందించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ శ్రీనివాసులు గురువారం పేర్కొన్నారు. ఎంపిపి సమక్షంలో అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. ఇదివరకు చేసిన అభివృద్ధి, ఇకపై చేయాల్సిన అభివృద్ధిపై చర్చలు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఎవరైనా గైర్హాజరయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపి నేతల కబ్జాలను నిరూపిస్తాం

- ఎక్కడ గొడవలు జరిగినా మంత్రి భరత్‌పై నెపం వేస్తున్నారు
- టిడిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వైసిపి నాయకుల కబ్జాలను నిరూపిస్తామని, కర్నూలులో ఎక్కడ గొడవలు జరిగినా రాష్ట్ర మంత్రి టిజి.భరత్‌పై నెట్టే ప్రయత్నం వైసిపి నాయకులు చేస్తున్నారని టిడిపి కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 23వ వార్డు వైసిపి కార్పొరేటర్ కటారి పల్లవి, ఆమె భర్త కటారి సురేష్ చేసిన కబ్జాలపై అన్ని సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వీటిని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంలో అనవసరంగా మంత్రి టిజి.భరత్‌పై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. నగరంలో కుటుంబ గొడవలు జరిగితే కూడా మంత్రి చేయించినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కార్పొరేటర్లు విలువను కాపాడుకోవాలని హితవు పలికారు. తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. శ్రీరామ్ నగర్‌లో నిరుద్యోగులు ఉపాధి కోసం బంకులు వేసుకుంటే చిన్నారులు, మహిళల పేర్లు చెప్పుకొని వైసిపి నేతలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. తాగుబోతుల గొడవలకు కూడా టిడిపి నేతలు కారణమంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైసిపి నాయకులు 'చిల్లర రాజకీయాలు' మానుకోవాలని హితవు పలికారు. కటారి పల్లవి భర్త కటారి సురేష్ చేసిన కబ్జాలను బంకుల వద్దనే నిరూపిస్తామని తెలిపారు. కెడిసిసి బ్యాంకులో డబ్బులు ఇప్పిస్తామని చెప్పి శ్రీరామ్ నగర్‌లో చాలా మంది వద్ద నుంచి గ్రూపుల వారీగా రూ.2 వేల చొప్పున కటారి సురేష్ వసూలు చేశారని చెప్పారు. ఇంతవరకు వారికి డబ్బులు ఇవ్వలేదన్నారు. బాధితులందరినీ ఎస్పీ దగ్గరకు తీసుకెళ్తామన్నారు. కార్పొరేటర్లు పరమేష్, క్రాంతికిషోర్, ఫరాజ్ ఖాన్, జకియా అక్సారీ, విజయకుమారి, కైప పద్మలత, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు అబ్బాస్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు గున్నామార్క్, స్వామిరెడ్డి, రామాంజనేయులు, సుంకన్న, ఖాదర్ బాషా, అకీమ్, కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. గురువారం ఇఒఆర్‌డి సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు. నాగన్న, వ్యకాస మండల ఉపాధ్యక్షులు టి.మల్లేష్, మాసుం బాష, భాస్కర్, కెవిపిఎస్ నాయకులు కృష్ణుడు మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టంలో పనులు చేయని వారు ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు రాజకీయ పలుకుబడి ఉన్న వారు మస్టర్లలో పేరు నమోదు చేసుకొని ఉపాధి డబ్బులను కొల్లగొడుతున్నారని తెలిపారు. కూలీలు పనులు చేసి నెలల తరబడి ఎదురుచూసినా డబ్బులు రావడం లేదని చెప్పారు. వారం, వారం డబ్బులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం ఆదోనిలోని మాత, శిశు సంక్షేమ ప్రభుత్వాస్పత్రిని ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించారు. వార్డులో ప్రసవమైన బాలింతల దగ్గరకు వెళ్లి వైద్య సేవల గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా, నాణ్యతగా ఉంటుందా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసవం కోసం పేదలే వస్తున్నారని, వారి పట్ల మానవత్వంతో ప్రవర్తించాలని వైద్యులకు సూచించారు. రోగికి బీపీ పెరిగిందని, సాధారణ కాన్పు చేయలేమని, కర్నూలుకు రెఫర్ అంటూ ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లేలా కొందరు ప్రోత్సహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అలా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజువారీగా జరిగే సాధారణ సిజేరియన్ ప్రసవాల గురించి సూపరిటెండెంట్ డాక్టర్ మాధవి లతను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పక్కాగా నైపుణ్య గణన : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

శిక్షణ ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నైపుణ్యాల గణన పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో సచివాలయం వార్డు సెక్రటరీలకు నైపుణ్యాల గణనపై అవగాహన కల్పించారు. టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసులు, కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్ అల్తాఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటినీ సందర్శించి నైపుణ్యం యాప్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. త్వరలోనే గణన సర్వే మొదలయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు. ఇంట్లోని వారి వివరాలను నమోదు చేస్తూ 15 నుంచి 59 ఏళ్ల వారి విద్యార్హత, వారికుండే నైపుణ్యత గురించి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆటోమొబైల్, మెకానికల్, కంప్యూటర్, ప్లంబింగ్ ఇతర చేతివృత్తుల వివరాలను అందులో పొందుపరచాలని చెప్పారు. ఈ సర్వేలో ఎలాంటి తప్పులకూ తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతుందన్నారు. ఎలాంటి సందేహాలు కలిగినా సంప్రదించాలని సూచించారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- పనులను ప్రారంభించిన వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

భూమిపూజ చేస్తున్న జూటూరు మారయ్య, గ్రామ పెద్దలు

డేగులపాడు గ్రామంలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఎంపిపి జూటూరు హేమలత భర్త, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపిపి గ్రాంటు రూ.15 లక్షలతో గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి పోతప్ప ఆలయం వరకు సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. సమస్యలు ఉన్న గ్రామాల్లో ఎమ్మెల్యే విరుపాక్షి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతతో కూడిన కంకర, సిమెంట్‌ను నిర్మాణాలకు వాడాలని సూచించారు. వైసిపి నాయకులు జూటూరు లాలు స్వామి, నీటి సంఘం మాజీ నాయకులు జూటూరు లింగన్న పాల్గొన్నారు.

శ్రీమఠంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం



ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామిని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం దర్శించుకున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆమె గ్రామ దేవత మంచాలమ్మను, శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- కుంటుపడుతున్న విద్యాభివృద్ధి
- 50 శాతం ఉపాధ్యాయులతోనే విద్యా బోధన

అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన మండలాల్లో ఒకటైన కౌతాళంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఏకోపాధ్యాయ పాఠశాలలు, అసలు ఉపాధ్యాయులే లేని పాఠశాలలు కూడా ఉన్నాయి. ఈ కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులను ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు విద్యాధికారులను కోరుతున్నారు.

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లా పశ్చిమ ప్రాంత మండలమైన కౌతాళంలో 59 పాఠశాలల్లో 14,478 విద్యార్థులు చదువుతున్నారు. మండలంలోని పాఠశాలలకు 263 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా కేవలం 131 మంది మాత్రమే ఉన్నారు. 50 శాతం ఉపాధ్యాయులతో ఆయా పాఠశాలల్లో చదువులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయులకు పాఠశాలలో కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. విద్యార్థులతో ప్రార్థనలు చేసిన అనంతరం విద్యార్థుల హాజరు, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, మురుగుదొడ్ల ఫొటోలు, మధ్యాహ్న భోజన పథకం, అపార్ కార్డు నమోదు, వివిధ మార్కుల నమోదు, వివిధ పరీక్షల నిర్వహణతోపాటు సబ్జెక్టుల ప్రకారం పాఠాలు బోధించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఈ కార్యక్రమాలు చేయలేక, విద్యా బోధన చేపట్టలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు

మండలంలో అరకొర ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలే కాకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలు కూడా ఉన్నాయి. ఓబులాపురం, కుమ్మలనూరు క్యాంపు-2, కౌతాళం ఉర్దూ, తిమ్మాపురం, వల్లూరు న్యూ, హాల్వి ఎస్‌డబ్ల్యు, పొదలకుంట పాఠశాలలు ఒకే ఒక ఉపాధ్యాయునితో నడుస్తున్నాయి. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యా బోధన చేయడం ఒకే ఒక ఉపాధ్యాయునితో సాధ్యమయ్యే పనేనా..? ఇలాంటి పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి ఏంటి..!

ఉపాధ్యాయుల్లేని పాఠశాలలు

ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలు, ఏకోపాధ్యాయ పాఠశాలలతోపాటు అసలు ఉపాధ్యాయులు లేని పాఠశాలలు కూడా ఉన్నాయి. విద్యావ్యవస్థ ఎలా ఉందో.. ఉన్నతాధికారులే చెప్పాలి. మండలంలో చూడి, ఉరుకుంద హెచ్‌డబ్ల్యు, కుమ్మలనూరు క్యాంపు-2 గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు లేరు..! డిప్యూటేషన్‌పై వేసిన ఉపాధ్యాయులతో ఈ పాఠశాలలు నడుస్తున్నాయి.

విద్యాశాఖాధికారులపై ఒత్తిడి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. గ్రామ నాయకులతో, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మండల విద్యాధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ఉపాధ్యాయులను నియమించి తమ పిల్లల భవిష్యత్తును చక్కదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉపాధ్యాయులు లేని కారణంగా చదువులో తమ పిల్లలు వెనుకబడి విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఎంఇఒలను



విద్యాబోధన చేపడుతున్న ఉపాధ్యాయుడు

నిలదీస్తున్నారు. ఈ విషయంపై ఎంఇఒలు శోభారాణి, ఆంజనేయులును వివరణ కోరగా... ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయం వాస్తవమే. సర్దుబాట్లు చేస్తూనే ఉన్నామని, ఇంతకుమించి ఏమీ చేయలేమని వారు పేర్కొన్నారు.

ఎంఇఒ శోభారాణి

మండలంలో పాఠశాలలో పరిస్థితులు ఇలా ఉండడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. ఇప్పటికే 600 మంది విద్యార్థులు బడి బయట ఉన్నారు. ఈ మండలంలో అక్షరాస్యతలో ముందడుగు వేయాలంటే ఉపాధ్యాయుల కొరతను తీర్చాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు రాబోయే మెగా డీఎస్సీ ద్వారా అయినా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జింకను కాపాడిన తహశీల్దార్

జింకను పరిశీలిస్తున్న తహశీల్దార్ శివరాముడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రమాదంలో గాయపడిన జింకను చూసి తహశీల్దార్ శివ రాముడు చలించిపోయారు. వన్యప్రాణులను రక్షించే బాధ్యతలు ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. గురువారం మండలంలోని చిన్నగోనెహాళ్ గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు తహశీల్దార్ శివరాముడు బయల్దేరారు. మార్గ మధ్యంలో మదిరే గ్రామ సమీపంలో ప్రమాదంలో గాయపడిన జింకను అటు పోతున్న కొందరు గ్రామస్తులు చూస్తూ ఉండిపోయారు. జనమెందుకు గుమికూడారని తహశీల్దార్ విచారించారు. జింక ప్రమాదంలో గాయపడిందని కొందరు తెలిపారు. ఆయన వాహనాన్ని పక్కన పెట్టి సిబ్బందితో కలిసి పొలంలో ఉన్న జింకను చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు వచ్చే వరకు అక్కడే ఉండి వారికి అప్పగించారు. అనంతరం రెవెన్యూ సదస్సుకు బయల్దేరి వెళ్లారు. అక్కడ ఉన్న గ్రామస్తులతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వన్యప్రాణాలను రక్షించాలని, ఇలా గాయపడితే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముళ్ల కంపలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - ఆలూరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న ముళ్లకంప

మండలంలోని మనేకుర్తి గ్రామంలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని విద్యుత్ శాఖలో నెలలో రెండో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రీ కటింగ్, మెయింటినెన్స్ చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఎలాంటి పనులూ చేపట్టడం లేదనడానికి పై చిత్రమే నిదర్శనం. గాలి, వర్షాలు వచ్చినప్పుడు స్పార్క్ రావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ముళ్ల కంపను తొలగించి ప్రమాదం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఫొటో స్టూడియో దగ్ధం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని కాచాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో ఫొటో స్టూడియో దగ్ధమైంది. గురువారం కెఎం బాషా డిజిటల్ ఫొటో స్టూడియోలో విద్యుదాఘాతంతో స్టూడియోలో ఉన్న కంప్యూటర్‌తో పాటు ల్యాప్‌టాప్‌లు, నాలుగు డిజిటల్ కెమెరాలు, రెండు జిరాక్స్ మిషన్లు, పది ఆల్బమ్‌లు సుమారు రూ.10 లక్షల విలువ గల వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు కెఎం.బాషా వాపోయారు. ప్రభుత్వం స్పందించి తగిన ఆర్థిక సహాయం అందించి జీవనోపాధి కల్పించాలని బాధితుడు కోరారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

ఈనెల 9, 10న గూడూరులో జరిగే యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు ఎన్.నాగమణి, ఎస్.దావీదు, జె.ఎల్లప్ప, నరసింహులు, దేవపాల్ కోరారు. గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఎం.రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, స్వర్ణోత్సవ మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 50 ఏళ్లుగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తున్న సంఘం యుటిఎఫ్ అని తెలిపారు. రెండురోజుల పాటు జరిగే మహాసభల్లో మొదటిరోజు ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం జరిగే ప్రతినిధుల సభలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవటానికి సంఘంగా, ఉపాధ్యాయులుగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు ఎం.నాగరాజు, బి.రాఘవేంద్ర, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న, వై.రామాంజనేయులు, చంద్రపాల్, ఎన్.నాగరాజు, శివకుమార్, ప్రశాంత్ భూపాల్, కె.లక్ష్మన్న, ఆర్.రాజశేఖర్, ఎస్.ప్రసాద్, జి.బాబు, కె.రాజు, రవికుమార్ పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని వివిధ పాఠశాలల్లో యుటిఎఫ్ నాయకులు ఆహ్వాన పత్రికలను అందించి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను ఈనెల 9, 10న గూడూరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్ మాట్లాడారు. మహాసభల తొలి రోజు 9న ఉపాధ్యాయ ప్రదర్శన, ప్రారంభ సభకు కార్యకర్తలు, సభ్యులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. 10న సాయంత్రం జరిగే ప్రతినిధుల సభకు ప్రతినిధులంతా హాజరు కావాలని తెలిపారు. **గోనెగండ్ల**లోని అధికారులకు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మహాసభల ఆహ్వాన పత్రికలను అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.మద్దిలేటి, యు.చంద్రపాల్, నాయకులు విజయ్ కుమార్, నాగేశ్వరరావు, అక్బర్, తాజుద్దీన్, అబ్దుల్ సలీమ్, సుజిత, ఉమా, ఖాజన్న, జయరాజు, రమేష్, నాగరాజు, నర్మద, రంగస్వామి, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ఎరిగేరి ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం ఉపాధ్యాయులను జిల్లా మహాసభలకు ఆహ్వానించారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నాయకులు వెంకటేశ్వర్లు, రంగన్న, సుధాకర్ నాయక్, లింగన్న, రంగారెడ్డి పాల్గొన్నారు.

గోనెగండ్లలో...

నందవరంలో

కౌతాళంలో

మరో ట్యాంకు నిర్మిస్తాం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో మరో వాటర్ ట్యాంకు నిర్మిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నాగలదిన్నె గ్రామంలో పర్యటించారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి అభివృద్ధి భూమిపూజ చేశారు. గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.3 కోట్లతో జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. గ్రామంలో అతి పెద్ద సమస్య పట్టాల పంపిణీ అని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజలకు పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ పట్టాలను తారుమారు చేసి ప్రజలను ఇబ్బందికి గురి చేసిందని విమర్శించారు. వాటిపై సమగ్ర విచారణ చేపట్టి త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు జబ్బార్, నాగలదిన్నె ఈరన్న, తిమ్మప్ప, ఉరుకుందు, గౌస్, ధర్మపురం గోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఖాసీంవలీ, ముగతి ఈరన్న గౌడ్, సోమలగూడూర్ వెంకటరామిరెడ్డి, బండే గురుస్వామి, డబ్బా ఈరన్న, కైరవాడి వీరేష్, ఆదిశేషులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఘనంగా సివి.రామన్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆస్పరి

నారాయణ ప్రైమ్ స్కూల్‌లో సివి.రామన్ జయంతి వేడుకలను ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... యువత సివి.రామన్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

- మదాసి/మదారి కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి - హోళగుందా

కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మదాసి/మదారి కురువ సంఘం కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం హోళగుందలో మదాసి కురువ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య, కనకశ్రీ యూత్ నాయకులు ఎస్‌కె.గిరి, మదాసి కురువ సంఘం మండల అధ్యక్షులు పంపాపతి మాట్లాడారు. కనకదాసు జయంతిని ఈనెల 18న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కనకదాసు భవనం, మ్యూజియం, విద్యాసంస్థలను జిల్లాలో, రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు కోగిలతోట శేషప్ప, బసవ, చిన్నహ్యాట మాజీ సర్పంచి కెబి.వీరభద్రప్ప, మదాసి కురువ సంఘం మండల సహాయ కార్యదర్శి గాది, నాయకులు గాదిలింగప్ప, మండల ఉపాధ్యక్షులు రవి, సలహాదారుడు రామాంజనేయులు, డాక్టర్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి మైలారి, జాతీయ సంగొల్లి రాయన్న సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి మంజునాథ్, మదాసి కురువ సంఘం సభ్యులు గోపాల్, సిద్ధప్ప, నరేగల్ల పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంతో

అక్రమ సంపాదనకు తెర..!

- ఇళ్లు, లాడ్జీల నిర్మాణాలకు తరలింపు

- ఆదాయ వనరుగా మారిన వైనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉచిత ఇసుక విధానంతో కొందరు అక్రమ సంపాదనకు తెర తీశారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ లేకున్నా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో ఇసుక దొరకకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, గృహ నిర్మాణంపై ఆధార పడిన రంగాలు కుదేలయ్యాయి.



డంపు చేసిన ఇసుక

గమనించిన ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ప్రజల ఉపాధి కోసం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానంతో కొందరు అక్రమార్కులు అక్రమ సంపాదనకు తెర తీశారు. ఉచిత ఇసుక విధానంలో అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. 'తెలుగు తమ్ముళ్ల' సహకారంతో స్థానిక తుంగభద్ర నది నుంచి మంచాల, చెట్నేహళ్లి, కలుదేవకుంట, చిలుకలడోణ తదితర గ్రామాల ట్రాక్టర్ల యజమానులు గృహ నిర్మాణాలు, లాడ్జీల యజమానులతో ట్రాక్టర్ ఇసుకను రూ.1500కు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. లోకల్‌గా రూ.1500, బయటకు అయితే రూ. 3 వేల నుండి రూ. 4 వేల వరకు వసూలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానం వ్యాపారులకు లాభసాటిగా మారింది. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఇంటి యజమాని ఆధార్ కార్డుతో, నిర్మాణం జరుగుతున్న స్థలం ధ్రువీకరణ పత్రంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి వద్ద ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరమో తెలిపి రవాణా చేసే ట్రాక్టర్ నెంబర్‌తో అనుమతి పొందాల్సి ఉంది. ఈ నిబంధనలను ఉల్లంఘించినా ప్రశ్నించేవారే కరువయ్యారు. ఏ అధికారి నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా రాత్రి, పగలు దర్జాగా రవాణా చేస్తున్న వారు కొందరు కాగా మరికొందరు డంప్ చేసుకున్నారు. పైగా ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అంటూ బ్యానర్ వేయించి ట్రాక్టర్‌కు కట్టి దర్జాగా తోలుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటు మైన్స్, రెవెన్యూ అధికారులు కానీ ఇటు పోలీసు శాఖ అధికారులు కానీ స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ విధానాలను అనుసరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వారిపై టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా టిడిపి శ్రేణులను హెచ్చరించినా ఇలాంటి అవినీతి, అక్రమాలకు తెర లేపారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

నారాయణపురంలో '104' వైద్య సేవలు

- సర్పంచి కుర్చీని పక్కన పెట్టడంపై ఆగ్రహం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని నారాయణపురం గ్రామంలో 104 ద్వారా గురువారం వైద్య సేవలు అందించారు. కమ్మరచేడు పిహెచ్‌సి డాక్టర్ సుష్మిత హాజరై గ్రామస్తులకు వైద్య సేవలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు గ్రామస్తులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. శీతాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన చేశారు.

సర్పంచి కుర్చీని పక్కన పెట్టడంపై ఆగ్రహం

గ్రామంలో హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ పంచాయతీలో వైద్య సేవలు అందించడం, పంచాయతీ కార్యాలయంలో మరో గదిని

విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పెట్టుకొని కావాలని సర్పంచి సీటును పక్కకు నెట్టేసి విధులు నిర్వహించడంపై సర్పంచి అల్లమ్మ గారి సరళమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్నారంటే సర్పంచిగా వైద్యసేవ అధికారులకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామని, వైసిపి సర్పంచిని కావడంతో ఇలా చిన్న చూపు చూడడం దారుణమని ఆమె తెలిపారు. గ్రామానికి ప్రథమ పౌరులైన సర్పంచి కుర్చీని పక్కన పెట్టడంపై గ్రామస్తులు చర్చించుకున్నారు.

'బీమా యోజన'ను సద్వినియోగం చేసుకోండి : ఎఒ

ప్రజాశక్తి - తుగ్గలి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎఒ పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలని తెలిపారు. డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలని, వరికి డిసెంబర్ 31లోపు చెల్లించాలని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పప్పు శనగ, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు వస్తాయని, వాతావరణ బీమా కింద వస్తాయని తెలిపారు.

క్యాన్సర్‌ను అశ్రద్ధ చేయవద్దు

- ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్యాన్సర్ వ్యాధిని అశ్రద్ధ చేయవద్దని ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జాతీయ క్యాన్సర్ వ్యాధి అవగాహన దినోత్సవం సందర్భంగా అందరికీ ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని బ్యానర్‌తో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో క్యాన్సర్ అంటే కొద్దిగా భయపడేవారని, రానురాను క్యాన్సర్‌ను అశ్రద్ధ చేస్తున్న వారు ఎక్కువ అవుతున్నారని తెలిపారు. అలాంటి పనులు చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకొని క్యాన్సర్‌ను నయం చేసుకోవాలని సూచించారు. 18 వయస్సు దాటిన వారందరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు ఇంటింటికీ వెళ్లి పరీక్షిస్తామన్నారు. క్యాన్సర్ లక్షణాలు కనపడితే నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా సంబంధిత డాక్టర్లతో పరీక్షించుకొని నయం చేసుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఎన్ఎంలు విమలాదేవి, పద్మావతి, రామ్మోహన్, కృష్ణ, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో క్యాన్సర్ నివారణకు చేయించుకోవాల్సిన ముందస్తు వైద్య పరీక్షలపై ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డిడిఒ డాక్టర్ రంగరవళి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుక్సానా, ప్రభుత్వ ఆయుష్ వైద్యులు డాక్టర్ ఖాద్రీ, సిహెచ్‌ఒ మేరీ, ఎంపిహెచ్‌ఇఒ హనుమంతు, ఎంపిహెచ్‌ఎస్‌లు పరమేశప్ప, కృష్ణ, శాంతమ్మ, ఫార్మాసిస్ట్ జగదీష్, సుధాకర్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని బల్లేకల్, జాలమంచి, పెద్దహరివాణం, ఇస్వి, బసాపురం, సాంబగల్, మండిగిరి గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు జయమ్మ, పుష్పలత, విజయలక్ష్మి, కృష్ణవేణి, సిహెచ్‌ఒలు నాగరాజ్, పద్మావతి మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధికి గురైన వారు ముందస్తు వైద్యం చేయించుకోవడం వల్ల వ్యాధి నయం అవుతుందని తెలిపారు. బీడీలు, సిగరెట్లు, మద్యం, గుట్కా వంటి వాటిని వాడడం వల్ల ఈ వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉందని చెప్పారు. ఈనెల 15 నుంచి ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ గ్రామాల్లో పర్యటించి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి, స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, వారికి వైద్య సేవలు అందించాలని తెలిపారు. **కోడుమూరు (రూరల్)** పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ నుంచి ప్రారంభమైన ర్యాలీ కోట్ల సర్కిల్, పాతబస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, కొత్తబస్టాండ్, చిన్న, పెద్ద బోయ గేరి, తేరు బజార్, సంత మార్కెట్, పుర వీధుల గుండా సాగింది. ఆరోగ్య విస్తరణాధికారి నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కె.కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

గోనెగండ్లలో...

ఆదోనిలో...

గుంతల రహిత రహదారులే లక్ష్యం

- ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో గుంతల రహిత రహదారులను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆర్అండ్‌బి ఎస్ఇ పి.మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. 'మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' కింద మొదటి దశలో 69 పనులను రూ.11.16 కోట్లతో 412.15 కిలోమీటర్ల గుంతల రహిత రహదారుల కార్యక్రమం చేపట్టామని చెప్పారు. అలాగే రెండో దశలో 171 పనులు రూ.8.71 కోట్లతో 426.5 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా, కంపలు లేని రహదారులుగా ఈఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సంక్రాంతి పండగ నాటికి రోడ్లు గుంతలు లేకుండా చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో

M.V.O.P.NO.195/2023

ఉప్పర అంజనయ్య వగైరా. ...అర్జిదారులు

-Vs-

ఉప్పర చిన్న వీరన్న వగైరా. ...రెస్పాండెంట్లు

1, 3 రెస్పాండెంట్లకు నోటీసులు

1) ఉప్పర చిన్న వీరన్న తండ్రి యు.హనుమంతు, ఇంటి నెం.3-259, బి.సి.కాలని, కులుమాల గ్రామము, గోనెగండ్ల (మం), కర్నూలు జిల్లా (ఓనర్)

3) ఉప్పర వీరేష్ తండ్రి యు.అంజనయ్య, కులుమాల గ్రామము, గోనెగండ్ల మండలం, కర్నూలు జిల్లా (డ్రైవర్)

పై నెంబర్ M.V.O.P లో ఉప్పర శంకరమ్మ 17.05.2021 తేదిన రోడ్డు ప్రమాదములో చనిపోయిన దని ఆమెకు నష్టపరిహారముగా రూ॥8,00,000/- సదరు మొత్తము పైన ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డితో ఇప్పించమని మరియు కోర్టు ఖర్చులు రాగోరి అర్జి దాఖలు చేసినారు. ఇందులో 1,3, రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 25-11-2024 తేది పగలు 10.30 గం॥కు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఎ. శ్రీనివాసులు,

అర్జిదారుపరం అడ్వకేటు, కర్నూలు.